ఎవరి ధీమా వారిదే.!

- ప్రచారంలో అందరికీ అనూహ్య స్పందన
- ఓటు 'మీట' నొక్కేదెవరికో..?
- అంతుపట్టని ఓటరు అంతరంగం



వేములవాడరూరల్: ఈసారి ఎన్నికలు భలే ఆసక్తికరంగా మారాయి. త్రిముఖ పోటీ వల్ల ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు సర్వశక్తులను ఒడ్డాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈసారి ఎన్నికల ప్రచారంలో ఏ పార్టీ అభ్యర్థి ర్యాలీ చూసినా వందల సంఖ్యల్లో కార్యకర్తలు, అభిమానులతో సందడిగా కనిపించింది. దీంతో అభ్యర్థులు ఎవరికి వారే తమ గెలుపు ఖాయమని భావిస్తునే, మరోవైపు చివరి ప్రయత్నాల్లో ఉన్నారు. ఎన్నికల చివరి ఘట్టం తుది దశకు చేరుకున్న కొద్ది గంటల ముందు కూడా అభ్యర్థుల అనుచరులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయాసపడ్డారు. తమ అభిమాన నాయకుడిని గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేశారు. బూత్‌స్థాయి కార్యకర్తలు తమకు కేటాయించిన ఇళ్లలో ఎంతమంది ఓటర్లున్నారు. వారికి ఏ పార్టీతో సంబంధం ఉంది.? అనుకూలంగా ఉన్నారా, లేకుంటే తమవైపుకు ఏవిధంగా తిప్పుకోవాలి. ఏవిధంగా లొంగే అవకాశాలున్నాయి అనే విషయాలపై ఎప్పటికప్పుడు ఆయా వార్డు ఇన్‌చార్జిలతో మాట్లాడుకుంటూ వారిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తునే వచ్చారు. ఈ విషయంలో అభ్యర్థులు విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీ చేసేందుకు వెనుకాడలేదు. అర్ధరాత్రి వరకు విందు, వినోదాలతో ఓటర్లను లోబర్చుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

అంతుపట్టని అంతరంగం

ఇంత చేసినా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటరు తన ఓటును ఎవరికి వేస్తారనే విషయంలో మాత్రం అభ్యర్థులు, నాయకులు అంచనా వేయలేకపోతున్నారు. ఏ పార్టీకి చెందిన వారు వస్తే వారికి ఓటే స్తామని చెప్పిన ఓటరు అంతరంగం అంతుపట్టకున్నా, పోలింగ్ అయ్యే వరకు ఎవరికి వారే తామే గెలుస్తున్నట్లు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ శ్రేణులను పోలింగ్‌కు సమాయత్తం చేస్తున్నారు. పోలింగ్ సమయంలో వ్యవహరించాల్సిన తీరు. చివరి ప్రయత్నంగా ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు వచ్చే ముందు ఏవిధంగా వ్యవహరించాలనే విషయమై పార్టీ శ్రేణులకు వివరించారు. పోలింగ్ పూర్తయ్యేవరకు ఏమరుపాటుతో వ్యవహరించాలని, ప్రత్యర్థుల వ్యూహాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ దొంగ ఓట్లు పడకుండా జాగ్రత్త పడాలని, పోలింగ్ బూత్‌ను ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టకుండా చివరివరకు అప్రమత్తంగా ఉండాలని నాయకులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి తెలిపారు.

అందరిదీ గెలుపు మాటే..

పార్టీల నుంచి బీ–ఫాం తీసుకుని పోటీలో ఉన్న అభ్యర్థుల నుంచి స్వతంత్ర్య అభ్యర్థులుగా నామినేషన్ వేసిన అభ్యర్థులు సైతం గెలుపు తమదేనంటూ చివరి నిమిషం వరకు ప్రచారం సాగించారు. కానీ వేములవాడ నియోజకవర్గంలో బీ–ఫాంతో పోటీలో ఉన్న అభ్యర్థుల మధ్యే పోటీ హోరాహోరీగా ఉంటుందని ప్రచారం సాగుతోంది. గురువారం ఉదయం జరిగే పోలింగ్‌లో తమకు అండగా నిలిచి ఓటు వేసే ఓటరును ప్రసన్నం చేసుకునేందుకు పోటీలో ఉన్న అభ్యర్థులు బుధవారం అర్ధరాత్రి సైతం కంటికి కునుకులేకుండా ప్రయత్నాలు చేస్తునే ఉన్నారు. వేములవాడ నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అధికంగా ఉండడంతో వారిపైనే పోటీలో ఉన్న నాయకులు ఆశలు పెట్టుకుని ముందుకు సాగుతున్నారు.

మహిళా ఓట్లపై దృష్టి



ఈ ఎన్నికల్లో అన్ని పార్టీల నాయకులు తమ గెలుపు కోసం ప్రధానంగా మహిళా ఓట్లపై దృష్టిసారించారు. వారి ఓట్ల ద్వారానే తాము గెలుస్తామనే నమ్మకంతో ఆయా పార్టీల అభ్యర్థులు నగదును వారికి అందజేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే కొంతమంది సంఘాలకు పంపిణీ కూడా పూర్తయినట్లు సమాచారం. ఒక ఇంటిలో ఇద్దరు మహిళలు ఉంటే వారికే నగదు రూపంలో అందజేస్తున్నారు. వారికి భర్తలకు మాత్రం లేకుండా భార్యలకే ఇస్తున్నట్లు తెలిసింది. మహిళలు మాట మీద ఉంటారనే నమ్మకంతో మహిళా ఓటర్లకు ఎర వేస్తూ ఓట్లు దండుకుంటున్నారు. మరి అభ్యర్థులు ఇచ్చే నగదును తీసుకుని మహిళలు ఎవరికి పట్టం కడతారో తెలియదు కానీ ఎన్నడూ లేని విధంగా మహిళా ఓటర్లకే డబ్బులు పంపడంతో వారి భర్తలు ఓట్లు వేస్తారో ఇక గెలుపు, ఓటములను బట్టి తెలియాల్సి ఉంది. అయితే ఒక పార్టీ నాయకుడు రూ.2500 ఇవ్వగా మరో పార్టీ నాయకుడు రూ.1500 మరొకరు రూ.500 ఇస్తున్నట్లు తెలిసింది.

మొదటిసారి ఓటు.. భవితకు బాట

సాక్షి 'యువ'గళం

ముస్తాబాద్/వేములవాడరూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం. పాలకులను ఎన్నుకునే గొప్ప అవకాశం ఒక్క ఓటుకు మాత్రమే ఉంది. ప్రజలు తమకు నచ్చిన నాయకుడిని పాలకులుగా ఎన్నుకునే గొప్ప అవకాశాన్ని భారత రాజ్యాంగం కల్పించింది. భారతదేశం యువతతో నిండిపోగా, నాటి బాలలు నేటి పౌరులుగా ఎదిగారు. అందులో నూతనంగా ఓటు హక్కును పొందిన 18 ఏళ్ల యువత ఓటు స్వామ్యం గురించి తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఓటు హక్కు వినియోగించుకోవడం గొప్ప అవకాశంగా భావిస్తున్నామని నూతన ఓటర్లు అంటున్నారు.

రాజ్యాంగం కల్పించిన హక్కు



నేడు జరగనున్న పోలింగ్‌లో మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకోబోతున్నా. రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు. అభివృద్ధి చేసే నాయకుడిని ప్రజాప్రతినిధిగా ఎన్నుకునే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది.

– బెదురు రేఖ, ముస్తాబాద్

గొప్ప అవకాశంగా భావిస్తున్నా



మా ఇంట్లో పెద్దలు నా చిన్నప్పుడు ఓట్లు వేయడం చూశా. ఇప్పుడు నేనే ఓటు వేయడం గొప్ప అవకాశంగా భావి స్తున్నా. మనకు నచ్చిన నేతను మనమే ఓటు ద్వారా ఎన్నుకోవడం ప్రజాస్వామ్యంలోనే ఉన్న గొప్ప అవకాశం.

– ఎ.కిరణ్‌సాయి, ముస్తాబాద్

కాలేజీ నుంచి నేరుగా వచ్చా



తొలిసారిగా వచ్చిన ఓటు హక్కును వినియోగించుకునేందుకు హైదరాబాద్ కాలేజీ నుంచి మా ఫ్రెండ్స్‌తో కలిసి వచ్చాం. ప్రతి ఒక్కరు ఓటు విలువను గుర్తించి దానిని నమోదు చేయాలి. అప్పుడే విజన్ ఉన్న నాయకుడు ప్రజాప్రతినిధి అవుతాడు.

– కుంబాల దినేశ్‌రెడ్డి, ముస్తాబాద్

ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశం



ఓటు హక్కు కలిగి వుండడం గొప్ప అవకాశంగా భావిస్తున్నా. తొలిసారిగా ఓటు వేయడం గొప్ప అనుభూతిని ఇస్తుంది. మన ప్రజాప్రతినిధులను మనమే ఎన్నుకునే గొప్ప అవకాశం ఓటు కల్పిస్తుంది. ఓటుహక్కు కలిగి వున్న వారందరు తప్పకుండా ఓటు వేయాలి. మంచి నాయకులను చట్టసభలకు పంపించాలి.

– వంగరి సాయికుమార్, ముస్తాబాద్

ప్రజాస్వామ్య రక్షణకు ఓటు



ప్రజాస్వామ్యం పరిరక్షణకు ఓటు ఆయుధం. పనిచేయని వారిని ఇంటికి పంపించి, పనిచేసే నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఓటుకు మాత్రమే ఉంది. మొదటిసారి ఓటు వేయడం గొప్ప అవకాశంగా భావిస్తున్నా. సమర్థులైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో యువత ముందుండాలి.

– నిఖిల్‌కుమార్, ముస్తాబాద్

అభివృద్ధి చేసే నాయకునికే నా ఓటు



ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారి ఓటు వేయడానికి నాకు హక్కు లభించింది. మా ప్రాంతాన్ని అభివృద్ధి చేసి మాకు అందుబాటులో ఉండే నాయకుడికే ఓటు వేస్తా. ఓటు వేయమని చాలామంది అడిగినా నాకు ఇష్టమైన నాయకుడికే ఓటు వేస్తాను.

– పెద్ది రాజేశ్, వేములవాడ

నిజాయితీపరుడికి నా ఓటు



మొదటి ఓటును నిజాయితీకే వేస్తా. నిరుద్యోగుల సమస్యను పరిష్కరించే నాయకుడిని గుర్తించి ఎన్నుకుంటాం. వేములవాడ నియోజకవర్గం అభివృద్ధి కావాలంటే అభ్యర్థి నిజాయితీగా పనిచేసేవారై ఉండాలి.

– గట్టు మణిదీప్, వట్టెంల

పోలింగ్‌కు రంగం సిద్ధం

- పోలింగ్‌స్టేషన్లకు చేరుకున్న సిబ్బంది
- పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు
- కేంద్ర పోలీసు బలగాలతో బందోబస్తు



తంగళ్లపల్లిలో ఈవీఎం, వీవీప్యాట్‌లతో వస్తున్న ఎన్నికల సిబ్బంది



వీర్నపల్లి: ఎన్నికల సామగ్రితో పోలింగ్ అధికారులు



బోయినపల్లి పోలింగ్ స్టేషన్ ఎదుట అభ్యర్థుల జాబితా అంటిస్తున్న సిబ్బంది



ముస్తాబాద్ పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సిబ్బంది బుధవారం సాయంత్రం పోలీసు బందోబస్తు మధ్య ఈవీఎం, వీవిఫ్యాట్‌లతో పాటు ఇతర ఎన్నికల సామగ్రితో ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వీలుగా ఆయా కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌తోపాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక పోలీస్‌ను రక్షణగా కేటాయించారు. కాగా ఎన్నికల సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. ఎన్నికల సిబ్బందికి బుధవారం సాయంత్రం టీ, స్నాక్స్, రాత్రి చపాతి, రైస్, వెజ్ కర్రీ, పెరుగు, గురువారం ఉదయం టీ, స్నాక్స్, అల్పాహారం, మధ్యాహ్నం శాఖాహారం భోజనం, గుడ్డు, పెరుగు, సాయంత్రం టీ, స్నాక్స్ అందించనున్నారు. ఓటర్లకు ఎండకు ఇబ్బంది లేకుండా టెంట్లు, డ్రింకింగ్ వాటర్ ఏర్పాటు చేయడంతోపాటు విద్యుత్ దీపాలు, టాయిలెట్లను ఏర్పాటు చేశారు. దివ్యాంగులకు ఇబ్బంది జరగకుండా వీల్ చైర్లను అందుబాటులో ఉంచారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా కేంద్ర పోలీసు బలగాలతో భారీ బందోబస్తు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాలకు సమీపంలో 144 సెక్షన్ విధించారు. నలుగురికంటే ఎక్కువమంది గుమికూడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేశారు.

– తంగళ్లపల్లి/ముస్తాబాద్/బోయినపల్లి/రుద్రంగి/వీర్నపల్లి/వేములవాడఅర్బన్

అటెన్షన్ ప్లీజ్

వంగిన విద్యుత్ స్తంభాలు



ఎల్లారెడ్డిపేట: మండలం నారాయణపూర్ శివారులోని వ్యవసాయి పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు వంగి ప్రమాదకరంగా మారాయి. రైతులు వ్యవసాయ పనులు చేసుకునేందుకు జంకుతున్నారు. స్తంభాలను సరిచేయాలని రైతులు మొరపెట్టుకున్న అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సెస్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి
పృథ్వీధర్‌గౌడ్,
సెస్ ఏఈఈ, ఎల్లారెడ్డిపేట
ఫోన్ నంబర్:
94408 14081

చిత్రకథ

రోడ్డు పక్కనే గుంత



ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు వెళ్లే రహదారిలో రోడ్డు పక్కన గుంత ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కన ఉన్న గుంత కనిపించక వాహనదారులు అందులో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ గుంతను పూడ్చివేయాలని ప్రజలు కోరినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చివేయాలని కోరుతున్నారు.

ముస్తాబాద్‌లో వీధి కుక్కల బెడద

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో వీధి కుక్కల బెడద పెరుగుతోంది. గుంపులుగా పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఒకవైపు కోతుల బెడదతో ఇబ్బందులు పడుతుండగా, ప్రజలకు ఇప్పుడు కుక్కల బెడద ఎక్కువైంది. ప్రధాన రహదారితోపాటు కాలనీల్లో కుక్కల సంచారం పెరిగింది. వీధి కుక్కల దాడులతో పలువురు గాయాలపాలవుతున్నారు. పంచాయతీ అధికారులు వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



ముస్తాబాద్‌లో గుంపులుగా వీధి కుక్కలు

ఏజెంట్ల నియామకంలో బిజీ

వేములవాడ: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగే ఓటింగ్‌లో తమతమ పార్టీల తరపున ఏజెంట్లను నియమించేందుకు అభ్యర్థులు, వారి అనుయాయులు బుధవారం ముమ్మర యత్నాలు చేశారు. ఉదయం 6 గంటలకే టిఫిన్లు పూర్తి చేసుకుని 7 గంటలలోపుగానే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, మధ్యాహ్న భోజనాలు అక్కడే ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పార్టీల నాయకులు తెలిపారు.

విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీ

వేములవాడ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెండు రోజులుగా అన్ని గ్రామాల్లో వేములవాడ పట్టణంలోని వార్డుల్లో మద్యం ఏరులై పారుతోంది. గురువారం పోలింగ్ ఉండటంతో ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు మద్యం బాటిళ్లు, నగదు ముట్టజెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఓటర్లు, కొన్ని కుల సంఘాల నాయకులు, సభ్యులు తాము ఇంతమంది ఉన్నామంటూ అభ్యర్థుల అనుయాయులకు ఫోన్లు చేస్తూ మరీ నగదు, మద్యం తెప్పించుకుంటున్నట్లు తెలిసింది. దీంతో పోటీలో ఉన్న అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఒక్కో ఓటుకు పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టజెబుతున్నట్లు జనం చెప్పుకుంటున్నారు. మద్యం దుకాణాలు మూసివేసినప్పటికీ గ్రామాల్లో మద్యం ఏరులై పారింది. ఎక్కడ చూసినా విందులే కనిపించాయి. బుధవారం పట్టణంలోని రోడ్లన్నీ బోసిపోయి కనిపించాయి.

ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్న నలుగురిపై కేసు

చందుర్తి: ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. మండలంలోని లింగంపేటలో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారన్న గ్రామస్తుల ఫిర్యాదుతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గ్రామానికి చేరుకుని నలుగురిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.71,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల ఫిర్యాదుతో తర్రె లక్ష్మణ్, గుడిసె గంగయ్య, లింగంపల్లి గంగారాజం, గంగాధర కిరణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.